పాతాళానికి టమాట ధర

- పశువులను మేపుతున్న వైనం
- హోల్‌సేల్‌గా కిలో ఫస్ట్ క్వాలిటీ రూ.4, సెకండ్ క్వాలిటీ రూ.3
- బయట మార్కెట్‌లో రిటైల్‌గా కిలో రూ.పది
- నష్టపోతున్న రైతులు, లబ్దిపొందుతున్న వ్యాపారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిన్నటి వరకూ వినియోగదారులకు చుక్కలు చూపించిన టమాట ధర అమాంతం పాతాళానికి పడిపోయింది. ఏడాది పొడవునా డిమాండ్ ఉండే టమాట ధర ప్రస్తుతం రైతుకు కన్నీటిని మిగిల్చింది. వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలేక ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో నల్లగొండ జిల్లాలో టమాట సాగు 1200 ఎకరాల్లో సాగైంది. ఇదే తరహాలో టమాట ఉత్పత్తి పెరిగింది. అయితే మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. టమాట కోసం పెట్టిన పెట్టుబడైనా రావడం లేదంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట ధర (హోల్‌సేల్‌గా) 25 కిలోల బాక్స్ రూ.80-100 పలుకుతుంది. ఫస్ట్ క్వాలిటీ రకం టమాటకు రూ.100, సెకండ్ క్వాలిటీ రూ.70-80 అమ్ముడుపోతుంది. ఎకరం విస్తీర్ణంలో టమాట సాగు చేసేందుకు రూ.40- రూ.50 వేల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ.. మార్కెట్‌లో ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటాలు తెంపి మార్కెట్‌కు తరలిచేందుకు ఒక బాక్స్‌కు రూ.40 నుండి రూ.60 రూపాయలు ఆటో కిరాయి అవుతుంది. ఒక్కో రైతు సుమారు రోజుకు 50-80 బాక్స్‌లు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఒక బాక్స్‌కు సుమారు రూ.30 రవాణా చార్జీలు వేసుకుంటే.. 50 బాక్స్‌లకు రూ. 1500 ఆటో చార్జీలు అవుతున్నాయి. మార్కెట్‌లో పంట అమ్మితే.. కనీసం రవాణా చార్జీలు కూడా మిగలడం లేదని రైతులు వాపోతున్నారు. గతేడాది ఏడాది కిలో టమాట రూ.80 నుంచి రూ.100 ధర పలికింది. ఈ సారీ మంచి ధర వస్తుందనే గంపెడాశతో సాగు చేసిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. భూమి కౌలుకు తీసుకుని సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రభుత్వం టమాట రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రిటైల్‌గా కిలో టమాటకు రూ. పది...

కూరగాయల మార్కెట్‌లో రైతుల వద్ద దళారులు కిలో టమాట మూడు రూపాయలకు కొనుగోలు చేస్తే..అదే టమాటాను కూరగాయల వ్యాపారులు మాత్రం కిలో టమాట రూ.పదికి అమ్ముతున్నారు. కిలో టమాటపైన వ్యాపారులు రూ.తొమ్మి వరకు లబ్దిపొందుతున్నారు. కానీ.. రైతులు మాత్రం నష్టపోతున్నారు.

శీతల గిడ్డంగులు ఎక్కడ...?

పంటలను నిల్వ ఉంచుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా శీతలగిడ్డంగులు ఏర్పాటు చేస్తామంటున్న పాలకుల మాటలు ఆచరణ రూపం దాల్చడం లేదు. గిట్టుబాటు ధర రాకుంటే.. పంటను నిలువ ఉంచుకునేందుకు జిల్లాలో శీతల గిడ్డంగులు కరువయ్యాయి.

రవాణా చార్జీలు కూడా వస్తలే

ఎకరం విస్తీర్ణంలో టమాట సాగు చేశాను. పంట కోసం రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటివరకు మూడు సార్లు టమాటను తెంపాం. ఫస్ట్ కోతలో 60 బాక్స్‌లు, సెకండ్ కోతలో 30 బాక్స్‌లు, థర్డ్ కోతలో 65 బాక్స్‌ల టమాటలు వచ్చాయి. ఒక బాక్స్ (25 కిలోలు) 80 రూపాయలకు అమ్ముడుపోయింది. పంటను పొలం నుంచి మార్కెట్‌కు తరలించేందుకు ఒక బాక్స్‌కు రూ.25 ఆటోకిరాయి తీసుకున్నారు. పంట తెంపేందుకు రోజుకు మహిళకు రూ.300 కూలీ, కల్లుసీసా, మగవారికి రూ.600 కూలీ, క్వార్టర్ మందు పోయించా. పంట అమ్మితే కనీసం రవాణా చార్జీలు రాలేదు.

పంతంగి లింగస్వామి-రైతు, గుండ్లపల్లి

ఆటో కిరాయి రూ.600...

రెండెకరాలు కౌలుకు తీసుకుని టమాట పంట సాగు చేశాను. కౌలు రూ. 12 వేలు, పంట సాగుకోసం పెట్టుబడిగా రూ.60 వేల వరకు పెట్టాను. నాలుగు కోతలు తీశాను. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌కు 18 బాక్స్‌లు తీసుకొచ్చా. ఆటో కిరాయి రూ.600 తీసుకున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు.పంట సాగు చేసి నష్టపోయాను.

కొండ వెంకన్న-రైతు కంచనపల్లి

ఉత్పత్తి పెరగడంతో ధర తగ్గింది..

గతేడాది టమాట పంటకు డిమాండ్ బాగుండే. కిలో వంద రూపాయల వరకు అమ్ముడు పోయింది. రైతులూ పొందారు. ఈ సారి టమాటకు ధర ఉంటుందని ఎక్కువగా సాగు చేశారు. వర్షాలకు పంటలు కొంత దెబ్బతిన్నప్పటికీ.. మళ్లీ నారు వేసుకున్నారు. పంట సాగు పెరిగింది. గతేడాది 730 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయగా, ఈ సారి యాసంగిలో 1200 ఎకరాల వరకు సాగుచేశారు టమాట ఉత్పత్తి పెరిగింది. మార్కెట్‌కు టమాట అధికంగా రావడంతో ధర పడిపోయింది.

సంగీతలక్ష్మి-జిల్లా ఉద్యానశాఖ అధికారి

ప్రమాదకరంగా మంచిర్యాల రహదారులు

- రోడ్ల మరమ్మతు చేయాలని సిపిఎం ధర్నా



రోడ్డు మరమ్మతులు చేయాలని అందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు గుంతలమయ్యాయి. రోడ్లు మరమ్మతు చేయకపోవడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయని సిపిఎం నాయకులు మండిపడ్డారు. గుంతలమయంగా మారిన రహదారులను ఆదివారం సిపిఎం నాయకులు పరిశీలించారు. రోడ్ల పరిస్థితిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి మట్లాడుతూ అభివృద్ధి అంటూ ప్రచారం చేసుకునే నాయకులకు అధ్వానంగా మారిన రహదారులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

సంవత్సరాల తరబడి బైపాస్ రోడ్డు దుమ్ముదూళితో ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం వల్ల రోడ్ల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. బైపాస్ రోడ్డుతో పాటు ఫ్లైఓవర్ రోడ్డు గుంతలుగా మారి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల వల్ల అనేకమంది క్షతగాత్రులుగా మారుతున్నారని, అన్ని విధాలుగా ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. అధికారులు నాయకులు స్పందించి రోడ్ల మరమ్మతు చేపట్టాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, దూలం శ్రీనివాస్, బోడంకి చందు, జిల్లా కమిటీ సభ్యుడు డి.మోహన్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని, ఉపాధ్యాయ రంగాన్ని కలపడం సరికాదు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐటిడిఎ పరిధిలోని హాస్టల్ సంక్షేమ అధికారి పర్మినెంట్ పోస్టులను ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇవ్వడం సరైంది కాదని ఎస్‌ఎఫ్ఐ అభిప్రాయపడింది. ఈ చర్య వల్ల సంక్షేమ అధికారులకు, ఉపాధ్యాయులకు మధ్య ఘర్షణలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. కావున సంక్షేమ అధికారుల పోస్టులు వారికే ఉంచాలనీ, టీచర్లకు ఉపాధ్యాయుల్లోనే కొనసాగించాలని తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ పోస్ట్ కోసం ఉపాధ్యాయులు ప్రతి ఏడాది ఘర్షణ పడతారనీ, పాత వార్డెన్లు విద్యార్థులను పావులుగా వాడుకొని రాజకీయాలు చేస్తారని, అలాంటి వాతావరణం పోవాలంటే ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలోనూ పర్మినెంట్ సంక్షేమ అధికారిని నియమించాలని కోరారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలకు కూడా ప్రత్యేకంగా వసతి గృహ సంక్షేమ అధికారిని నియమించాలనీ, ప్రస్తుతం సంక్షేమ అధికారులుగా కొనసాగుతున్నటువంటి వారి స్థానాలను టీచర్లతో భర్తీ చేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏలో విడుదల చేసినటువంటి సంక్షేమ అధికారుల డిప్టేషన్ రద్దులో తిరిగి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌లో ఉన్నటువంటి వాళ్ళనే కొనసాగించే చర్య వెనక్కి తీసుకోవాలని కోరారు. అలాగే హాస్టల్లో వర్కర్లుగా వార్డెన్లుగా, కమాటీలుగా పని చేస్తున్న నాలుగోతరగతి ఉద్యోగులనీ, ఎటువంటి శిక్షణ లేకుండా ఉన్నఫలంగా సంక్షేమ అధికారులుగా చేర్చడం వలన రికార్డుల భద్రత, విద్యార్థుల సంరక్షణ, వారి పర్యవేక్షణ, బాగోలేదనే కారణాన్ని చూపెట్టి హాస్టళ్లను ఎత్తివేయాలనేటువంటి ఆలోచన చేసే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ అయినటువంటి సంక్షేమ అధికారులను యధావిధిగా కొనసాగించి భవిష్యత్తులో పూర్తి చేయనన్ను నోటిఫికేషన్ల తోటి ఆ ఖాళీలను పూర్తి చేయాలని సంక్షేమ రంగం, సంక్షేమ అధికారులను ఉపాధ్యాయులని ఒకేతాటి మీదికి తీసుకురావాలని అటువంటి ఆలోచన విరమించుకోవాలని కోరారు.

ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా కవులు, కళాకారులు రచనలు చేయాలి : ఎమ్మెల్సీ కవిత

- బుక్ ఫెయిర్‌లో తెలంగాణ జాగృతి స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా కవులు, కళకారులు రచనలు చేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 35వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ఆదివారం కవిత సందర్శించారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్‌లో తెలంగాణ జాగృతి స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాళ్లను కవిత తిలకించారు. పిల్లల పుస్తకాలు, సాహిత్యం, కథల పుస్తకాలను కొనుగోలు చేశారు. అనంతరం కవి, వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న రాసిన 'వల్లంకి తాళం' సంకలన కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ఫాసిస్ట్ పాలన కొనసాగుతున్న నేపథ్యంలో కవులు, కళకారులు ప్రజలను చైతన్యం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. గోరేటి వెంకన్న రచనా శైలి అద్భుతంగా ఉంటుందన్నారు. దేశంలో మొట్టమొదటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తెలంగాణ బిడ్డ సురవరం ప్రతాపరెడ్డికి వచ్చిందని.. ఆ పరంపర గోరేటి వెంకన్న వరకు కొనసాగుతున్నదని చెప్పారు.

అనేక మంది గొప్ప కవులున్న వారసత్వాన్ని తెలంగాణ పుణికిపుచ్చుకుందన్నారు. వారు ప్రజల హృదయాలలో తరతరాలుగా గుర్తుండిపోయేలా రచనలు చేశారని, వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ వెంకన్న చేసిన వల్లంకి తాళం రచన అంతే అద్భుతంగా ఉందన్నారు. పనిలోంచి పుట్టిన పదాలను ఇటలీ భాషలో ఉపయోగిస్తారని.. తెలంగాణలోనూ కష్టాలు, శ్రమ ద్వారా వారి రచనలు ఉంటాయని వారి సాహిత్యం గొప్పగా ఉంటుందని చెప్పారు. అలాగే ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్‌గా తెలుగు ఖ్యాతిపొందిందని చెప్పారు. ఈ మట్టి, శ్రమ తత్వాన్ని అణువణువునా గోరేటి వెంకన్న తన రచనలో పొందుపరిచి కవిత్వం రాసారని తెలిపారు. చిన్న చిన్న పదాలతో అద్భుతంగా రాశారన్నారు. అడవి గురించి తన ఆకుపచ్చ కోవెలతో పోల్చడం అద్భుతమైన అంశమన్నారు. నల్లమలలో యురేనియం తవ్వడాన్ని నిషేధిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. మీరు పుట్టిన ఈ కాలంలో తాను పుట్టినందుకు గర్వంగా ఉందని.. మీతో పాటు కౌన్సిల్‌లో కూర్చోవడం సంతోషంగా ఉందని కవిత.. గోరేటి వెంకన్నతో అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, డాక్టర్ నాగేశ్వర్‌రావులు పాల్గొన్నారు.




స్టాల్‌ని సందర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత



కళాకారులుగా కొనసాగడం కొందరికే సాధ్యం

ప్రజాశక్తి-కల్చరల్

తల్లి తండ్రులు ప్రోత్సాహంతో చిన్ననాడు ఏదో కళను పిల్లలు నేర్చుకుంటరని, వయస్సు పెరిగే కొద్దీ ప్రాధాన్యతలు మారి కళాకారులుగా కొన సాగలేరని శాసన మండలి సభ్యురాలు సురభి వాణీ దేవి అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రధాన వేదికపై అలంకారం బృందం నిర్వహణలో భిన్న నృత్య సంగమం నృత్యాలంకరం నాట్య ప్రదదర్శనల ఝురి జరిగింది. వివిధ గురువుల శిష్య బృందాలు విభ్భిన్న నాట్య అంశాలు నయనమనోహరంగా నర్థించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వాణీదేవి, ఇస్రో గ్రూప్ డైరెక్టర్ పి గోపికృష్ణ పాల్గొన్నారు. వాణీదేవి మాట్లాడుతూ పెళ్లయి తరువాత లేదా ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత కష్టపడి నేర్చుకున్న కళను వదిలేయడం బాధాకరమన్నారు. గోపికృష్ణ మాట్లాడుతూ ఏదో కళలో ప్రవేశం ఉన్న వారు విద్యలోనూ ముందంజలో వుంటారని నిరూపణయిందని అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, న్యాయవాది లలిత రెడ్డి, రత్నాకర్ శర్మ, ఆదిత్య స్కూల్ నిర్వాహకుడు డాక్టర్ సుధాకర్ తదితరులు సభలో పాల్గొన్నార. సంస్థ డైరెక్టర్ లత సంస్థ లక్ష్యాలు వివరించారు. విజయ్ పాలం స్వాగతం పలుకగా వేణు మాధవ్ వందన సమర్పణ చేశారు



లాస్యను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

క్రికెట్ కోచ్‌గా తెలంగాణ తొలి మహిళ..

- భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర లాస్య ప్రతిభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర లాస్య తెలంగాణ నుంచి తొలి మహిళా క్రికెట్ కోచ్‌గా ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) అకాడమీ ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ కోచ్ ఎంపిక పరీక్ష నిర్వహించింది. దేశంలో ఎంపికైన ముగ్గురు క్రీడాకారుల్లో లాస్య ఒకరిగా నిలిచారు. బాల్యం నుంచే లాస్యకు క్రికెట్ అంటే మక్కువ. అదే ఆసక్తితో క్రికెట్ ఆటపై మెలకువలపై హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. అనంతరం ఐసిసి నిర్వహించే మొదటి శ్రేణి శిక్షణ కోర్సును పూర్తి చేసుకున్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించి కోచ్‌గా ఎదిగారు. శనివారం తండ్రి రమేష్‌తో కలిసి రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ నివాసంలో కలవగా ఆమెను మంత్రి అభినందించారు. రాష్ట్రం గర్వించేలా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. లాస్య తల్లి సునీత జాతీయ అథ్లెట్, ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల అధికారిణి. కాగా తండ్రి రమేష్ వాలీబాల్ క్రీడాకారుడు. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. క్రికెట్‌లో మెరుగైన శిక్షణ ఇస్తూ ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్ద డమే తన లక్ష్యమని లాస్య తెలిపారు. లాస్య ఎంపిక పట్ల జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక ప్రగతిలో రంగారెడ్డి టాప్

- రెండు, మూడో స్థానాల్లో హైదరాబాద్, మేడ్చల్
- చిట్టచివరిలో రాజన్న సిరిసిల్ల
- దేశంలోని జిల్లాల సామాజిక ప్రగతి ర్యాంకులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక ప్రగతి సూచిక (ఎస్‌పిఐ)లో రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా అగ్రగామిగా నిలిచింది. రెండు, మూడో స్థానంల్లో వరుసగా హైదరాబాద్, మేడ్చెల్ జిల్లాలు నిలిచాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది. దేశంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన సోషల్ ప్రోగ్రెస్ ఇండెక్స్ (ఎస్‌పిఐ) నివేదికను ప్రధాన మంత్రికి ఆర్థిక సలహా మండలి (ఇఎసి-పిఎం) విడుదల చేసింది. ప్రాథమిక మానవ అవసరాలు, ప్రజా శ్రేయస్సు పునాదులు, అవకాశాలు వంటి మూడు కీలక కోణాలలో సామాజిక పురోగతికి సంబంధించిన 12 విభాగాల ఆధారంగా జిల్లాలను సూచిక అంచనా వేసింది. ఈ సూచిక జిల్లా స్థాయిలో 49 అంశాలతో కూడిన విస్తృతమైన ఫ్రేమ్‌వర్క్‌ను నిర్వహించింది. 1. ప్రాథమిక మానవ అవసరాలు: అందులో పౌష్టికాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణ, తాగు నీరు, పారిశుధ్యం, వ్యక్తిగత భద్రత, ఆశ్రయం వంటి అంశాల్లో జిల్లాల పనితీరును అంచనా వేసింది. 2. ప్రజా శ్రేయస్సు పునాది: అందులో ప్రాథమిక విజ్ఞాన సదుపాయం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ యాక్సెస్, ఆరోగ్యం, ప్రజా క్షేమం (హెల్త్ అండ్ వెల్నెస్), పర్యావరణ నాణ్యత వంటి అంశాల్లో జిల్లాల పురోగతిని అంచనా వేసింది. 3. అవకాశాలు: ఇందులో వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపిక, సమగ్రత, అధునాతన విద్య అందించడం వంటి అంశాలపై దృష్టి పెట్టింది.

జిల్లాల వారీగా సామాజిక పురోగతి

దేశంలో 58 జిల్లాలు చాలా అధిక సామాజిక పురోగతి సాధించాయి. ఉత్తరాఖండ్‌లో 9, హిమాచల్‌ప్రదేశ్‌లో 7, మిజోరం, జమ్మూకాశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో ఆరు జిల్లాల చొప్పున, సిక్కిం, పుదుచ్చేరి, నాగాలాండ్, మణిపూర్‌ల్లో మూడు జిల్లాల చొప్పున, తమిళనాడు, కర్ణాటక, గోవా, అండమాన్ నికోబర్ దీవుల్లో రెండు జిల్లాల చొప్పున, పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీ, చండీగఢ్‌ల్లో ఒక్కో జిల్లా చొప్పున చాలా అధిక సామాజిక పురోగతి సాధించాయి. ఇందులో ఏపి, తెలంగాణకు చెందిన ఒక్క జిల్లా కూడా లేదు. అయితే 114 అధిక సామాజిక పురోగతి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన రెండేసి జిల్లాలు ఉన్నాయి. అప్పర్ మిడిల్ సోషల్ ప్రోగ్రెస్ సాధించిన 135 జిల్లాల్లో ఏపి, తెలంగాణకు చెందిన ఏడు జిల్లాల చొప్పున ఉన్నాయి. 147 లోయర్ మిడిల్ సోషల్ ప్రోగ్రెస్ జిల్లాల్లో తెలంగాణ 15, ఆంధ్రప్రదేశ్ నాలుగు జిల్లాలు ఉన్నాయి. 171 తక్కువ సామాజిక పురోగతి జిల్లాల్లో ఏపికి చెందిన 1, తెలంగాణకు చెందిన ఏడు జిల్లాలు ఉన్నాయి. దేశంలో 82 జిల్లాలు చాలా తక్కువ సామాజిక పురోగతిలో ఉన్నాయి.

రాష్ట్రంలోని జిల్లాల వారీగా స్కోర్

రంగారెడ్డి 62.0, హైదరాబాద్ 61.9, మేడ్చెల్ 60.0, ఖమ్మం 59.1, కరీంనగర్ 58.7, హన్మకొండ 58.4, నిజామాబాద్ 58.1, ఆదిలాబాద్ 57.9, మెదక్ 57.9, మహబూబ్ నగర్ 56.2, యాదాద్రి భువనగిరి 56.0, పెద్దపల్లి 56.0, జనగామ 55.8, నిర్మల్ 54.4, మంచిర్యాల 54.1, నల్గొండ 54.1, నాగర్ కర్నూల్ 53.9, సిద్దిపేట 53.9, వరంగల్ 53.5, జోగులాంబ గద్వాల 53.2, మహబూబాబాద్ 52.9, వనపర్తి 52.8, సంగారెడ్డి 52.5, సూర్యాపేట 52.3, వికారాబాద్ 51.1, కొమరంభీం ఆసిఫాబాద్ 51.0, జగిత్యాల 50.2, జయశంకర్ భూపాలపల్లి 50.1, భద్రాద్రి కొత్తగూడెం 49.9, కామారెడ్డి 49.1, రాజన్న సిరిసిల్ల 48.7 స్కోర్ సాధించాయి.

పోషకాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణ, మహిళలు, పిల్లల్లో రక్తహీనతపై పనితీరులో కేరళ అగ్రగామిగా నిలిచింది. కేరళ అత్యధికంగా 67.68 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. లక్షద్వీప్ 66.58 స్కోర్‌తో, సిక్కిం 65.57 స్కోర్‌తో రెండు, మూడు స్థానంల్లో ఉన్నాయి. బీహార్ (28.86 స్కోర్), ఉత్తరప్రదేశ్ (33.36 స్కోర్), జార్ఖండ్ (35.47 స్కోర్) కిందన ఉన్నాయి. మహిళల్లో రక్తహీనత ప్రాబల్యాన్ని తగ్గించడంలో కేరళ అధిక కాంపోనెంట్ స్కోర్ మెచ్చుకోదగిన పనితీరుకు కారణమని చెప్పవచ్చు. 6-59 నెలల వయస్సు గల పిల్లలలో రక్తహీనత విషయంలో దేశంలోనే అతి తక్కువ ప్రాబల్యం రేటు కేరళ సాధించింది. దేశంలోనే అత్యల్ప శిశు, పిల్లలు, ప్రసూతి మరణాల రేటులో కేరళ ఒకటిగా నిలిచింది. న్యూట్రిషన్, బేసిక్ మెడికల్ కేర్ కాంపోనెంట్‌లో 340 జిల్లాలు జాతీయ సగటు 38.59 కంటే ఎక్కువ స్కోర్ చేశాయి. ఇందులో కేరళకు చెందిన పతనంతిట్ట (63.09), కోజికోడ్ (62.21), తిరువంతపురం (62.03), అరుణాచల్ ప్రదేశ్‌కి చెందిన లాంగ్డింగ్ (62.92) అత్యధిక స్కోర్ చేసిన జిల్లాలుగా ఉన్నాయి. బీహార్‌కు చెందిన బంకా (18.57), లఖిసరాయ్ (18.58) అత్యల్ప స్కోరును సాధించాయి.

రాజ్యాంగాన్ని మార్చనున్న బిజెపి విధానాలను ప్రతిఘటించాలి

- మనుస్మృతి దహన కార్యక్రమంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగాన్ని మార్చనున్న బిజెపి విధానాలను ప్రతిఘటించాలనీ, వేల ఏళ్లుగా సామాజిక అసమానతలకు మూలమైన మనుస్మృతి భావాలను మట్టిలో పాతి పెట్టాలని వక్తలు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద మనుస్మృతిని ప్రతులను దహనం చేశారు. అనంతరం ఎస్‌వీకేలో కెవిపిఎస్, ఎస్‌వికె, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన సభకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో మెజారిటీ ప్రజలకు చదువు సంపదలు దూరం చేయడానికీ, మానసిక చట్టాల ద్వారా దోపిడీ పీడనలతో వంశపారంపర్యంగా అమలు జరుపుతూ అసమానతలకు మనుధర్మం మూలమైందన్నారు. శూద్రులు, స్త్రీలు మనుషులుగా పరిగణించకుండా అణిచివేసిందని, ఆధిపత్యాలకు ఆమోదం తెలిపిందని వివరించారు. వేల ఏళ్లుగా సమాజంలో దళితులను అంటరానితనానికి గురిచేసిన మను స్మృతి భావాలను మట్టిలో పాత రేయలన్నారు. కేంద్ర బిజెపి సర్కార్ తిరిగి ఆ ధర్మాలను ప్రవేశపెట్టజూస్తున్నదన్నారు. ఈ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. టిపిఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి రాములు మాట్లాడుతూ మహారాష్ట్రలోని మహాద్ పట్టణం చౌదార్ చెరువు నీటిని దళితులు తాగడాన్ని బ్రహ్మణీయ వర్గాలు జీర్ణించుకోలేక, ఆవుపేడ, మూత్రం కలిపారనీ, ఆ చర్యకు మూలమైన మనుస్మృతి గ్రంథాన్ని వేలాదిమందితో 1927 డిసెంబర్ 25న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దహనం చేశారని తెలిపారు. ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ స్వామి అల్వాల్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తన మాతృ సంస్థయిన ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో అంటరానితనాన్ని దళితుల తిండి, సంస్కృతిపై రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తుందనివిమర్శించారు. సభలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం డి అబ్బాస్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, డి వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీనియర్ నాయకులు జి రఘుపాల్ దితరులు ప్రసంగించారు. కెవిపిఎస్ నగర నాయకులు ఎం దశరథ్, టి సుబ్బారావు, బి పవన్ ,సందేపోగు పవన్, ఎస్‌వికె నాయకులు నల్లపు సోమయ్య సుజావతి, వి శంకర్, కృష్ణప్రసాద్, చెన్నయ్య, జగదీష్, వెంకన్న జానయ్య, వంశీ నాగేందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



శిక్షణ తీసుకుంటున్న వలంటీర్లు

ఖమ్మంలో రెడ్ షర్ట్ కవాతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా ఆదివారం ఖమ్మం పట్టణంలో రెడ్ షర్ట్ కవాత్ నిర్వహించారు. ఈ నెల 29న ఖమ్మం పట్టణంలో జరిగే మహాసభ జరగనుంది. ముదిగొండ మండల వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో డివైఎఫ్ఐ, సిపిఎం ఆధ్వర్యంలో మెలకువలు నేర్పిస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొని నలుగు మృతి చెందిన సంఘటన కొత్త హస్నాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతులు మహారాష్ట్ర వాసులుగా గుర్తించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిన్వట్ తాలూకా ఆనంద్ బోరి గ్రామానికి చెందిన వందన సుజీత్ దంపతులు తమ ఇద్దరు పిల్లలు సంస్కార్, మనిషాలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఎదురుగా మహారాష్ట్ర యావత్‌మాల్‌కు చెందిన వ్యక్తి ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. సంస్కార్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందాడు. వందన చికిత్స పొందుతున్నట్టు వైద్యులు తెలిపారు. మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దనూశ్రీ తెలిపారు.

విమానంలో వికృత చేష్టలు

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ విమాన సర్వీస్‌లో అనుచితంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని విమానాశ్రయ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారుల కథనం ప్రకారం... కేరళ తైమరవొంకరకు చెందిన అబే తలప్పలమలైల్ దోహ నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన సర్వీస్‌లో స్వదేశానికి బయలుదేరాడు. విమానంలో వికీత చేష్టలు చేస్తుండడంతో అడ్డుకున్న ఎయిర్‌లైన్స్ ఉద్యోగిపై దాడి చేశాడు. ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ భద్రతాధికారులకు ముందస్తు సమాచారం అందించారు. విమానాశ్రయంలో దిగిన ఆయనకు ఎయిర్ క్రాఫ్ట్ నిబంధనలపై అవగాహన కల్పించడానికి భద్రతాధికారులు ప్రయత్నించారు. వారిపైనా ఆయన దాడి చేశాడు. దీంతో, ఆయను అదుపులోకి తీసుకొన్నారు. ఆర్‌జిఐఎ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- 30 వరకు శీతాకాల విడిది

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సోమవారం నుంచి ఈ నెల 30 వరకు ఐదు రోజులపాటు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బస చేయనున్నారు. ఆమె తొలిసారి రాష్ట్రానికి వస్తుండడంతో గవర్నర్, ముఖ్యమంత్రి సహా అధికార యంత్రాంగం ఆమెను ఘనంగా స్వాగతించనున్నారు. సోమవారం సాయంత్రం 4.15 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట వైమానిక దళం శిక్షణ కేంద్రానికి రాష్ట్రపతి చేరుకోనున్నారు. గవర్నర్, సిఎం, ఉన్నతాధికారులతో భేటీ అనంతరం రాష్ట్రపతి నిలయానికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాల్లో ఆదివారం వాహన శ్రేణితో ట్రయల్ రన్ నిర్వహించారు. మేడ్చల్ కలెక్టర్ డాక్టర్.ఎస్.హరీశ్, ప్రొటోకాల్ అదనపు కార్యదర్శి అర్విందసింగ్, సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర, హకీంపేట విమానాశ్రయం చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నరేంద్రవర్మ, వింగ్ కమాండర్లు చౌదరి, పంకజ్‌జైన్... హకీంపేట విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో విమానాశ్రయం ప్రొటోకాల్ సహాయ కార్యదర్శి శశిధర్‌రెడ్డి, రాష్ట్రపతి ఏర్పాట్ల పర్యవేక్షణ అధికారి (నోడల్ ఆఫీసర్) ఆర్‌డిఒ రవి, బాలానగర్ డీసీపీ సందీప్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, జిల్లా అటవీ శాఖ అధికారి జానకిరామ్ పాల్గొన్నారు.

30వ తేదీ వరకూ పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు

రాష్ట్రపతి శీతాకాల విడిది సందర్భంగా పోలీసులు నగరంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నగరంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ అధికారుల చేతివాటం

- రూ.12 కోట్ల విలువైన భూమి కాజేసేందుకు కుట్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా తట్టిఅన్నారంలో మున్సిపల్ అధికారులు చేతవాటం చూపించారు. కబ్జాదారుడు కెవి సత్యనారాయణరెడ్డితో చేతులు కలిపి అవినీతికి పాల్పడ్డారు. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం... కెవి సత్యనారాయణ అనే వ్యక్తితో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై వివాదాస్పద ప్రయివేటు భూమిలో సిసి రోడ్డు నిర్మాణం చేయించారు. రూ.12 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు కుట చేశారు. ఈ క్రమంలో స్థానికులు వారిపై ఫిర్యాదు చేసినా మున్సిపల్ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. రోడ్డు ఆపేశామని చెప్పి తెల్లారేసరికి రోడ్డు పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణం అడ్డుకున్న బాధితుడిని కబ్జాదారుడు బెదిరించాడు. ఈ విషయాన్ని పోలీసు కమిషనర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రయివేటు గూండాలను పెట్టి పహరా కాస్తున్నట్టు తెలిపారు. దీంతో, సత్యనారాయణరెడ్డిపై హయత్‌నగర్ పోలీసలు కేసు నమోదు చేశారు.

రూ.400 కోసం వ్యక్తి హత్య

- హైదరాబాద్‌లో దారుణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బాలానగర్‌లో దారుణం చోటు చేసుకుంది. ఫుట్‌పాత్‌పై పడుకుని రోజువారీ కూలి పని చేసుకునే ఇద్దరు వ్యక్తులు రూ.400 కోసం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బాలానగర్ సిఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాశీరామ్, శ్రీనివాస్‌లు ఇద్దరూ కలిసి గత రెండ్రోజులు కూలిపనికి వెళ్లారు. కూలి డబ్బుల్లో రూ.400 కాశీరామ్‌కు శ్రీనివాస్ తక్కువ ఇచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. నర్సాపూర్ క్రాస్‌రోడ్ ఫుట్‌పాత్‌పై శ్రీనివాస్ నిద్రిస్తుండగా.. కాశీరామం అక్కడికి వచ్చి రూ.400 కోసం గొడవపడ్డాడు. ఈక్రమంలో శ్రీనివాస్‌ను కాశీరామ్ కర్రతో కొట్టి అటుగా వెళ్తున్న లారీ కిందకు తోసేశాడు. లారీ ఢీకొనడంతో శ్రీనివాస్ తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

గిరిజన యువకుడు హత్య

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో శనివారం అర్ధరాత్రి ఆదివాసీ చెంచు యువకుడి హత్యకు గురయ్యారు. అమ్రాబాద్ సిఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వీరబాబు, హతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మాచారం గ్రామానికి చెందిన దాసరి లింగస్వామి (24) అచ్చంపేట ఆశ్రమ పాఠశాలలో వర్కర్‌గా పనిచేస్తున్నారు. అమ్రాబాద్ మండలానికే చెందిన ఓ యువతి ప్రస్తుతం గద్వాలలో ఐటిడిఎ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమెతో ప్రేమలో ఉన్న లింగస్వామి శనివారం గద్వాల వెళ్లి ప్రియురాలిని ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి స్వగ్రామానికి వెళ్లేందుకు అచ్చంపేట బస్టాండ్‌లో వదిలిపెట్టారు. అనంతరం అచ్చంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మాచారంలోని తన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంతలో చీకట్లో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగుడు కత్తితో విచక్షణారహితంగా ఆయనపై దాడి చేశాడు. లింగస్వామి కేకలు వేయడంతో పొరుగున ఉన్న ఓ యువకుడు అటువైపు రాగా, దుండగుడు ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. కుటుంబసభ్యులు బయటకు వచ్చి చూడగా లింగస్వామి రక్తపు మడుగులో పడి ఉన్నారు. 108 అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దాడిలో లింగస్వామి ఛాతీపై 35 కత్తిపోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రేమ వ్యవహారాన్ని మానుకోవాలని యువతి కుటుంబసభ్యులు గతంలో హెచ్చరించారని హతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అంతకు ముందు ఆ యువతికి అచ్చంపేటకు చెందిన ఓ యువకునితో పెళ్లి చూపులు జరిగాయి. ఆ యువకుడిని యువతి నిరాకరించినా పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నాడని, వాట్సప్ సందేశాలు పంపుతున్నాడని యువతి లింగస్వామికి చెప్పింది. దీంతో లింగస్వామి అతన్ని హెచ్చరించాడు. హత్యకు యువతి కుటుంబ సభ్యులు, పెళ్లి చూపులకొచ్చిన యువకుడే కారణమని లింగస్వామి సోదరి సాయిలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా

మనుధర్మ శాస్త్ర ప్రతుల దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెవిపిఎస్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం మనుధర్మ శాస్త్ర ప్రతుల దహనం జరిగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల (కెవిపిఎస్, తెలంగాణ విద్యావంతుల వేదిక, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, తెలంగాణప్రదేశ్ ఎరుకల సంఘం, ప్రగతిశీల యువజన సంఘం, తెలంగాణ స్టూడెంట్ యూనియన్) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున పాల్గొన్నారు. చిట్యాల, మిర్యాలగూడ, నకిరేకల్, నార్కట్‌పల్లిలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జిట్ట నగేష్, రెముడా పరశురాములు, జిల్లా కమిటీ సభ్యులు ఒంటెపాక కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెరుకు పెద్దులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మనుస్మృతి ప్రతులను కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు దహనం చేశారు. హైదరాబాద్‌లోని ఒయులో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో కెఎన్‌వి, పిడిఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దగ్ధం చేశారు ఈ సందర్భంగా పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, కెఎన్‌వి రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్‌లు మాట్లాడుతూ మనువాద, బ్రాహ్మణీయ విధానాలకు వ్యతిరేకంగా, అసమానతలు లేని సమసమాజ స్థాపనకై విద్యార్థి లోకం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇసిఐఎల్‌లోని కమలానగర్‌లో స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన దహన కార్యక్రమంలో పిఎస్ఎన్ మూర్తి, శ్రీమన్నారాయణ, కోమటి రవి, వెంకట్ పాల్గొన్నారు.

మనువాదాన్ని వ్యతిరేకిద్దాం భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కెవిపిఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో, వికారాబాద్ పట్టణంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్ ఆధ్వర్యంలో, తాండూర్, దుద్యాల, కొడంగల్ మండలకేంద్రాల్లో విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, ఆమనగల్ మండల కేంద్రాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. కుల వ్యవస్థను బలపరుస్తూ శూద్రులను, మహిళలను చదువుకోవద్దని చెప్పడం, ఆస్తులు కలిగి ఉండడం,అభరణాలు ధరించడాన్ని నిషేధించడపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో, మంచిర్యాల జిల్లా కేంద్రంలో దళిత, భహుజన సంఘాలు, శ్రామిక సంఘాల ఆధ్వర్యంలో, కాసిపేట మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కెఇపిఎస్ ఆధ్వర్యంలో, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మనుస్మృతి ప్రతుల దహనం చేశారు.



మనుధర్మ శాస్త్ర ప్రతుల దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సామాజిక సాంస్కృతిక రాజకీయాలపై గొప్ప అంశం

- అరణ్య కృష్ణ రచించిన పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో జరిగే సామాజిక సాంస్కృతిక రాజకీయాలపై అరణ్య కృష్ణ చేసిన ప్రయత్నం గొప్ప అంశం అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో అరణ్యకృష్ణ రచించిన కొంచెం నిప్పు-కొంచెం నీరు పుస్తకాన్ని ప్రఖ్యాత రచయిత ఓల్గా అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్, ఆత్మీయ అతిథులుగా కె సజయ, తేళ్ల అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల దేశంలోని స్త్రీలు పడుతున్న భాధలు, వారి సమస్యలపై రచయిత అరణ్యకృష్ణ చక్కగా తన రచనలో స్పష్టం చేశారని అన్నారు. ప్రతీ కుల హత్య వెనుక పరువు ఉంటుందని, ప్రతీ పరువు వెనుక జెండర్ రాజకీయాలు, ఆస్తి రాజకీయాలు ఉంటాయనే విషయాన్ని రచయిత చక్కగా వివరించారని తెలిపారు. దేశంలో ప్రశ్నించే వారిపై జరుగుతున్న దాడులను ఆయన తన రచనల ద్వారా చెప్పడం ఇప్పుడు చాలా అవసరమన్నారు.

మేడ్చల్ బిఆర్ఎస్‌లో రచ్చకెక్కిన విభేదాలు

అధిష్ఠానం సైలెంట్‌పై సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి మల్లారెడ్డి వ్యవహారంపై అధిష్టానం నోరు మెదపకపోవడం మేడ్చల్ జిల్లాలో ఆసక్తిగా మారింది. సొంతపార్టీ ఎమ్మెల్యేలు ఆయనపై తిరుగుబాటు చేస్తూ బహిరంగంగా విమర్శనాస్త్రాలు సంధించినా అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తీరును తప్పుబడుతూ జిల్లా ఎమ్మెల్యేలంతా అసంతృప్తి గళం వినిపించారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే నేతృత్వంలో సమావేశమైన శాసనసభ్యులు మల్లారెడ్డిపై బహిరంగంగా, జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజుపై పరోక్షంగా ఆరోపణలు గుప్పించారు. నామినేటెడ్ పదవుల ఖరారులో ఏకపక్ష వైఖరిని తప్పుబడుతూ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళతామని ప్రకటించారు. మంత్రి, ఎమ్మెల్యేల మధ్య అసమ్మతి వ్యవహారం రచ్చకెక్కి వారం రోజులవుతున్నా అధిష్టానం స్పందించకపోవడం, కనీసం అసమ్మతి ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాకపోవడం, సర్దుబాటుకు చొరవ చూపకపోవడం పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో బడా నేతలే క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడినా గులాబీ బాస్ పట్టించుకోకపోవడమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మంత్రి మల్లారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజుతో కలిసి జిల్లా పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యేలు ఆరోపించిన తీరుపై కూడా పార్టీ పెద్దలు మౌనం వహించడం వెనక అంతర్యమేమిటో అర్థం కావడంలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పార్టీలో చాప కింద నీరులా కొనసాగుతున్న విభేదాలు మంత్రి మల్లారెడ్డిపై ఎమ్మెల్యేల తిరుగుబాటుతో బహిర్గతమయ్యాయి. అధినేత కెసిఆర్ ఇటీవల సిట్టింగులందరికీ రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామన్న ప్రకటనతో ఆశావహుల్లో అలజడి మొదలైంది. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సిట్టింగ్‌లే టికెట్‌ను ఖరారు చేసుకునే దిశగా అడుగులు వేస్తుండగా, ఆశావహులు వ్యూహప్రతి వ్యూహాలతో పార్టీ గాడ్ ఫాదర్ల ఆశీస్సులతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఇరుగ్రూపుల మధ్య అంతర్గతంగా ఉన్న లుకలుకలు బయటపడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మళ్లీ బరిలో నిలిచేందుకు అన్ని అస్త్రాలూ సిద్ధం చేసుకోవటం ద్వారా ప్రజల మద్దతును కూడగట్టుకొడుతున్నారు ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తోన్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు శక్తియుక్తులను కూడగట్టుకుని గాడ్ ఫాదర్ల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో, నియోజకవర్గంలో ఇరువురి నేతల మధ్య పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ శ్రేణులు నలిగిపోతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి మళ్లీ పోటికి ఏర్పాట్లు చేసుకుంటుండగా, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ టికెట్ దక్కించుకొవడమే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇరువురి మధ్య తరచుగా పార్టీ వేదికలు, పార్టీ కార్యక్రమాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. మేడ్చల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే ,మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పోటాపోటీగా టికెట్ ఆశిస్తుండగా, మధ్యలో మంత్రి తనయుడు మహేందర్‌రెడ్డి కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోపాటు ఆయన తనయుడు మైనంపల్లి రోహిత్ పోటికి సిద్ధపడుతుండగా, కూకట్‌పల్లి సీటుపై సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతోపాటు ఎమ్మెల్సీ నవీన్‌రావు కూడా నజర్ పెట్టినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

బిజెపి బండారం బయటపెట్టినందుకే నాపై కుట్ర

- బెదిరింపులకు భయపడేది లేదు
- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే కుట్రలో ఎక్కడా డబ్బు అనే మాట లేదు, మనీలాండరింగ్ జరగలేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేవలం బిజెపి బండారం బయటపెట్టినందుకే ఇడిని ప్రయోగించారని ఆరోపించారు. "ఏదో విధంగా ఇడిని పంపించి నన్ను ఇబ్బంది పెట్టి, భయభ్రాంతులకు గురి చేసి.. లొంగదీసుకోవాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు. నన్ను, నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు భావిస్తున్నాం. ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న నన్ను పిలిచి విచారించారు. ఏ కేసులో అయినా నిందితులను ముందుగా పిలిచి విచారణ జరపడం మనందరికీ తెలిసిన విషయం. కానీ ఈ కేసులో మాత్రం అందుకు విరుద్ధంగా ఫిర్యాదుదారుడిని పిలిచి విచారించడం విడ్డూరంగా ఉంది. రెండు రోజులు నన్ను, అభిషేక్‌ను పిలిచి విచారించినా.. వాళ్లు అనుకున్నది అనుకున్నట్టు ఏదీ జరగలేదు. దీంతో రూటు మార్చి.. ముఖ్య సూత్రధారి అయిన నందకుమార్‌ని విచారిస్తామని కోర్టులో ఇడి పిటిషన్ దాఖలు చేసింది. రోహిత్‌రెడ్డిని అతని కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనే ఏకైక లక్ష్యంగా.. నందకుమార్‌తో వారికి అనుకూలంగా స్టేట్ మెంట్ తీసుకోవాలని చూస్తున్నారు. ఆ వాంగ్మూలంతో నన్ను ఈ కేసులో ఇరికించడమే వారి వ్యూహం అని మాకు అందిన సమాచారం. దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్టుగా ఉంది బిజెపి వ్యవహారం. మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, నా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసినా.. వ్యక్తిగత ఇమేజ్‌ని దెబ్బతియాలని చూసినా.. నేను మాత్రం తగ్గేదే లే. ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టినా ఎక్కడా వారికి ఎదురు దెబ్బ తగల్లేదు. కేవలం తెలంగాణలో మాత్రమే వారు అనుకున్నది ఒకటి.. అయిందొకటి. దీన్ని ఓర్వలేక అనేక కుట్రలు పన్నుతున్నారు. బిజెపి నాయకులకు ఒకటే చెబుతున్నా.. మీరు ఎన్ని నోటీసులిచ్చినా, ఎన్ని విచారణలు జరిపినా, ఎన్ని కేసులు పెట్టినా, అరెస్టు చేసినా నేను మాత్రం మీకు లొంగేదే లేదు. న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. మీరు పన్నిన కొత్త కుట్రను భగ్నం చేస్తాం.. తిప్పి కొడతాం. దీనిపై హైకో ర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయబోతున్నాం" అని రోహిత్‌రెడ్డి వెల్లడించారు.

చలపతిరావు మృతి పట్ల పలువురు సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ నటుడు చలపతిరావు మరణంతో తెలుగు చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. "ప్రముఖ నటులు చలపతిరావు మృతి దిగ్భ్రాంతి కలిగించింది. రోజుల వ్యవధిలో ఇద్దరు సినీ ప్రముఖులను కోల్పోవడం విషాదకరం. 1000కి పైగా సినిమాల్లో నటించిన ఆయన ఎన్టీఆర్‌కు ఎంతో ఆప్తుడు. చలపతిరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా"

- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

చలపతిరావుకు నటుడు చిరంజీవి నివాళులర్పించారు. రవిబాబు నివాసానికి చేరుకున్న ఆయన చలపతిరావు పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "ఈ డిసెంబర్ తీరని వేదన కలిగించింది. విలక్షణమైన నటుడు, తనదైన శైలిలో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న చలపతిరావు అకాల మరణ వార్త నన్ను కలచివేసింది. మద్రాసులో ఉన్నప్పటి నుంచే మాకు అనుబంధం ఉంది. ఎన్నో చిత్రాల్లో ఆయనతో కలిసి నేను నటించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. రవిబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులందరికీ నా ప్రగాఢ సానుభూతి"

- చిరంజీవి

"నేను మద్రాసులో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో.. చలపతిరావు అప్పుడప్పుడే పైకి వస్తున్న నటుడు. మేం కుటుంబసభ్యుల్లా ఉండేవాళ్లం. ప్రతి పండగకు నన్ను ఆహ్వానించి ఆప్యాయంగా భోజనం పెట్టేవారు. మా బ్యానర్‌లో ఎన్నో సినిమాల్లో ఆయన నటించారు. అతను సెట్‌లో ఉంటే కోలాహలంగా ఉంటుంది. మంచి మనసున్నవాడు. అజాతశత్రువు. అటువంటి మంచి వ్యక్తి మరణం సినిమా పరిశ్రమకే కాదు, నాక్కూడా తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి, ఆ కుటుంబానికి మనశ్శాంతి కలగాలని కోరుకుంటున్నా"

- మోహన్‌బాబు

"ప్రముఖ నటుడు చలపతిరావు మృతి చెందడం బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ప్రతినాయకుడిగానే కాకుండా సహాయనటుడిగానూ తనదైన శైలిలో ఆయన ప్రేక్షకుల్ని అలరించారు. నిర్మాతగా ఎన్నో మంచి చిత్రాలు నిర్మించారు. ఆయన కుమారుడు, నటుడు, దర్శకుడు రవిబాబు, ఇతర కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. తెలుగు సినీ పరిశ్రమలో ఒక తరానికి ప్రతినిధులుగా ఉన్న సీనియర్ నటులు ఒక్కొక్కరుగా ఇలా కాలం చేయడం దురదృష్టకరం"

- పవన్‌కల్యాణ్

"ప్రముఖ సినీ నటుడు చలపతి రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది. సాంఘిక, పౌరాణిక, చారిత్రక పాత్రల పోషణలో దిట్ట.. ప్రతినాయకుడిగా, సహాయనటుడిగా తనదైన ముద్రవేశారు. ఎన్‌టిఆర్‌కు ఏకలవ్య శిష్యుడు. తెలుగు సినీ పరిశ్రమ గొప్ప నటుడిని కోల్పోయింది. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

- కంభంపాటి రామమోహన్‌రావు

"పాత్ర ఏదైనా సరే ఆయన అందులో ఒదిగిపోయేవారు. ఆయన అకాల మరణం సినీ పరిశ్రమకు తీరని లోటు"

- ఎస్‌వి కష్ణారెడ్డి

"చలపతిరావు అకాల మరణం నన్ను ఎంతగానో కలచివేసింది. నందమూరి కుటుంబం ఇవాళ ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయింది. తాత గారి రోజుల నుండి మా కుటుంబానికి అత్యంత ఆప్తుడైన ఆయన మృతి మా అందరికీ తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నా ప్రార్థన"

- జూ.ఎన్‌టిఆర్

"సీనియర్ నటుడు, నిర్మాత చలపతిరావు మృతి ఎంతో కలచివేసింది. ఎన్నో సినిమాల్లో నటించి ప్రజల మనసులో ఆయన చెరగని ముద్ర వేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

- నారా లోకేశ్

"చలపతిరావు హఠాన్మరణం తీవ్రంగా కలిచివేసింది. తన విలక్షణమైన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించారు. నిర్మాతగా మంచి చిత్రాలని నిర్మించారు. ఈ రోజు తెలుగు చిత్ర పరిశ్రమ మంచి నటుడిని కోల్పోయింది. మా కుటుంబంతో ఆయనకు ఆత్మీయ బంధం ఉంది. నాన్నగారితో కలసి ఎన్నో చిత్రాల్లో నటించారు. నా చిత్రాల్లోనూ మంచి పాత్రలు పోషించారు. ఆయన మా కుటుంబ సభ్యుడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను"

- నందమూరి బాలకృష్ణ

"చలపతిరావు ఎంతో మంచి వ్యక్తి. ఎప్పుడూ సరదాగా ఉండేవారు. ప్రమాదం తర్వాత నుంచి ఆయన ఎక్కువగా బయటకు రాలేదు. ఇండస్ట్రీలో అందరితో స్నేహంగా ఉండేవారు. జోకులు వేస్తూ అందర్నీ నవ్వించేవారు. ఆయన మాకెంతో ఆప్తుడు. మూడ్రోజుల క్రితం షూట్‌లో పాల్గొన్నారు. ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు వరుసగా మృతి చెందడం దురదృష్టకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

- దగ్గుబాటి సురేశ్

"చలపతి రావు నాకు ఆప్త మిత్రుడు. నేను తెరకెక్కించిన ఎన్నో చిత్రాల్లో ఆయన నటించారు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవారు. ఈ రోజు ఇండస్ట్రీ ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది"

- ముత్యాల సుబ్బయ్య

సినీనటులు చలపతిరావు మృతికి ఎర్రబెల్లి సంతాపం

సీనియర్ సినీ నటులు, తెలుగు సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించిన ప్రేక్షకులను అలరించిన చలపతిరావు మృతి పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సినీపరిశ్రమ వరుసగా మంచి నటులను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. చలపతిరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాతవి చెల్లవంట..

కొత్తగా ఆధార్‌కార్డులివ్వాలంట..

- ఉపాధి కూలీల సమాచారంపై కేంద్రం ఆదేశాలు !
- ఏటేటా నిధుల్లో కోత... పనికల్పన అంతంతే
- తెలంగాణలో చట్టం అమలు విషయంలో అనేక ఆటంకాలు
- ఇప్పటికే బెంగాల్‌లో ఉపాధి హామీ చట్టం నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కుట్రల మీద కుట్రలు పన్నుతోంది. బడ్జెట్‌లో భారీ నిధుల కోత విధించిన మోడీ సర్కారు.. ఇప్పుడు కూలీల సంఖ్యను తగ్గించే యత్నంలో ఉంది. మళ్లీ కొత్తగా ఆధార్‌కార్డులివ్వాలని మెలికపెట్టింది. ఇప్పటికే కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయినట్టు, త్వరలో క్షేత్రస్థాయికి విషయాన్ని చేరవేనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు మూడు, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని చోట్ల కరోనా కాలంలో చేసిన పనులకు కూడా బిల్లులు అందని దుస్థితి నెలకొంది. టిఆర్ఎస్-బిజెపి కొనసాగుతున్న రాజకీయ పంచాయతీ కాస్త కూలీల మెడకు చుట్టుకుంటున్నది. ఆంక్షలు పెట్టి...వేతనాలు పెండింగ్‌లో పెట్టి...అడుగడుగునా ఆంటంకాలు సృష్టిస్తూ కూలీలే పనుల నుంచి తప్పించేలా చేస్తోంది. కేరళ ప్రభుత్వం మాత్రం కూలీల పక్షం వహిస్తున్నది. పట్టణ ప్రాంతాలకూ ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించి మన్ననలు పొందుతోంది. ఉపాధి హామీ చట్టం నిర్వహణ కోసం బడ్జెట్‌లో నిధులకు కోతపెడుతున్నది. ఈసారి రూ.73వేల కోట్లకు కుదించింది. అందులో రూ.20 వేల కోట్లు పాత బకాయిలకే. కులాల వారీగా డేటా తీసి కూలి చెల్లింపు విషయంపై దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో కాస్త వెనక్కి తగ్గింది. కానీ, మరోపంథాలో వెళ్తూ ఒక్కో రాష్ట్రంలో మెల్లమెల్లగా కుదిస్తూ పోతోంది. బెంగాల్‌లో ఆ చట్టాన్నే నిలిపివేసేలా చేసింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 18 బృందాలను పంపి తనిఖీలు చేపట్టి..రంధ్రాన్వేషణ చేసి మరీ కల్లాల పేరుతో కొర్రీలు పెట్టికూర్చున్నది. రూ.800 కోట్ల మేర నిలిపివేసింది. తాజాగా కేవలం 20 పనులను మాత్రమే గుర్తించాలనీ, వాటికే నిధులు విడుదల చేస్తామంటూ కేంద్రం మెలిక పెట్టి కూర్చుంది. దీంతో చాలా మంది పనికోల్పోయే ప్రమాదం ఉంది. ఉపాధి కూలీలు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పూట పనిచేస్తున్న ఫొటోలను సైట్‌లో అప్‌లోడ్ చేయాలంటూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ను మోడీ సర్కారు ఈ ఏడాది తీసుకొచ్చింది. ఇది కార్మికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వాస్తవానికి ఉపాధి హామీ చట్టం కింద ఆరుగంటలు పనిచేస్తే చాలు. కానీ, తాజా నిర్ణయంతో ఎనిమిది గంటలు పనిచేయాల్సి వస్తోంది.

ఇంత కష్టపడ్డా వారికి అందుతున్న కూలి రూ.140 నుంచి రూ.200 లోపే ఉంటున్నది. కరువులు, విపత్తులు నెలకొన్న ప్రాంతాల్లో ఉపాధి పనిదినాలను పెంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పెడచెవిన పెట్టింది. ఉపాధి హామీ ప్రాంతాల్లో వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలనీ, వారు చేసేందుకు వీలుగా ఉన్న పనినే చూపాలని స్పష్టంగా ఉన్నా అసలు వారికి పనే చూపని దుస్థితి నెలకొంది. పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ఉండట్లేదు.

ఆదర్శంగా కేరళ సర్కారు... పట్టణప్రాంతాల్లోనూ 'ఉపాధి'

కేంద్రం ఈ చట్ట నిర్వీర్యానికి యత్నిస్తుండగా..ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు సాగుతున్న కేరళలోని వామపక్ష ప్రభుత్వం మరింత పటిష్టంగా అమలు చేస్తున్నది. కేంద్రం నిధులు ఇవ్వకున్నా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాలకూ 'ఉపాధి'ని విస్తరించింది. 2016తో పోల్చిచూస్తే రెట్టింపు పనిదినాలను కూలీలకు కల్పిస్తున్నది. వంద రోజుల కల్పించడంలో గతంలో కంటే ఐదు రెట్లు మెరుగైంది. గిరిజన ప్రాంతాల్లో 200 రోజుల పనిని కూలీలకు చూపెడుతోంది. ఆ పనుల్లో మహిళలను ఎక్కువగా భాగస్వామ్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. 99.19 శాతం వేతనాలను పని చేసిన 15 రోజుల చెల్లిస్తున్నది. మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. మన రాష్ట్రంలోనేమో గ్రామాలను మండల కేంద్రాల్లో కలిపి మున్సిపాల్టీలుగా మార్చింది. దీంతో కూలీలు ఉపాధి హామీ పనులను కోల్పోయారు. పట్టణప్రాంతాలకు ఉపాధి పనులను విస్తరించాలనే డిమాండ్‌ను కెసిఆర్ ప్రభుత్వం పక్కనపడేసింది. మేట్లకు గుర్తింపుకార్డులివ్వట్లేదు. అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

అనుసంధానం పేరుతో మరో కుట్ర

వ్యవసాయానికి ఉపాధి హామీ చట్టాన్ని అనుసంధానం చేయాలనే కుట్రకు మోడీ సర్కారు పూనుకుంటున్నది. వాస్తవానికి వ్యవసాయ పనిదినాలు లేని సమయంలో కూలీలకు ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చినదే ఈ చట్టం. దీనివల్ల వ్యవసాయ కూలీల కొనుగోలు సామర్థ్యం కొంతమేర పెరిగింది. ఆ చట్టం కొండంత అండగా నిలుస్తూ వస్తున్నది. తాజాగా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర సర్కారు వ్యవసాయానికి అనుసంధానం అనే పల్లవిని ఎత్తుకున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అలా చేస్తే ఉపాధి కూలీలు, చిన్న, సన్న కారు రైతులు పనిదినాలను కోల్పోయే ప్రమాదం ఉంది. బడాభూస్వాములకు, కార్పొరేట్ వ్యవసాయం చేస్తున్నవాళ్లకు అనుకూల నిర్ణయం అనే విమర్శ బలంగా ఉంది.

కేరళ తరహాలో ఉపాధి చట్టానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

కేరళ రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలోనూ ఉపాధి హామీ చట్టానికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా పదిశాతం నిధులు కేటాయించాలి. పట్టణప్రాంతాల్లోనూ పనులు కల్పించాలి. ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచి రోజు కూలి రూ.600లకు పెంచాలి. రెండు పూటల ఫొటో అప్‌లోడ్ చేసే విధానాన్ని రద్దు చేయాలి. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. వేసవి అలవెన్స్ ఎత్తివేయడం దుర్మార్గం. వెంటనే పునరుద్ధరించాలి. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి. ఉపాధి చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయొద్దు.